# ఒక మొగ్గ రాలింది

ప్రతిరోజూ అందంగా ఉండే సాయంత్రం ముసురుపట్టడంతో ముందరే కాటుక పూసుకుంది. చితచితగా కురుస్తున్న వానజల్లు వల్లా, ఉండుండి వీస్తున్న వెర్రిగాలి వల్లా వెన్ను జలదరిస్తూంది. ఆకలితో అలమటించి ప్రాణం పోయిన వాడి నోట్లో పాయసం పోసినట్లుగా, ఎండలతో భూములన్నీ బీటలు వారి పంటలు నాశనమైన తరువాత కురుస్తున్న వానకి రైతు ప్రజల మనసు విలవిలలాడుతూంటే, ఆ చలి వాతావరణంలో ఇంటికిపోయి పెళ్ళాన్ని పక్కలోకి లాక్కుని ముసుగు వేసుకుని వెచ్చగా పడుకోకుండా, పరీక్షలు దగ్గరకొచ్చేసినా పాఠాలు పూర్తి కానందువల్ల, కుర్రాళ్ళకి సమయం దాటి బోధన చేయవలసి వచ్చినందుకు కుమారస్వామి మనసు కుతకుతలాడిపోతోంది.

"సార్! గదంతా చీకటిగా ఉంది. చీకట్లో ఏం రాసుకునేది?" ఒక కుర్రాడు కొంచెం తటపటాయిస్తూ అడిగాడు.

"స్కూల్లో దీపాలు లేనప్పుడు, సమయం దాటి పాఠాలు చెప్పమంటే ఇలాగే ఉంటుంది మరి! ఆ మూల ఎవరూ కూర్చుంట? శ్రీహరీ! నువ్వు పోయి హెడ్మాస్టరుగారితో చెప్పిరా!" అన్నాడు విసుగ్గా.

శ్రీహరి నెమ్మదిగా లేచి వరండాలోకి వెళ్ళి హెడ్మాస్టరుగారి గది వైపు దారి తీశాడు. హెడ్మాస్టరు బయట వరండాలో నిలుచుని, వాన చినుకుల్లో తడుస్తున్న గులాబీ మొక్కల వైపు చూస్తున్నాడు. శ్రీహరి ఆయన దగ్గరగా వెళ్లి, "సార్! గదిలో వెలుతురుగా లేదు. పాఠాలు చెప్పడం కష్టమని కుమారస్వామిగారు చెప్పమన్నారు" అన్నాడు.

"సరే. ఈ రోజుకి ఆపు చేయమను. రేపు ఉదయం ఎనిమిదింటికల్లా అందరూ రండి. ఆదివారం కదా అని అశ్రద్ధ చెయ్యకండి. మాస్టారిని ఒకసారిలా రమ్మనమని చెప్పు" అని హెడ్మాస్టరు మళ్ళీ మొక్కల వైపు దృష్టి సారించాడు.

శ్రీహరి తీసుకొచ్చిన వార్త విని ఆ రోజుకి పీడా విరగడైనందుకు ఆనందంగాను , మరునాడు ఉదయం మళ్ళీ తప్పనందుకు తిట్టుకుంటూను కుర్రాళ్ళు కుమారస్వామి

కూడా బయటపడ్డారు.

శ్రీహరి, కుమారస్వామి హెడ్మాష్టరున్న వైపు వెళ్ళారు. కుమారస్వామిని చూసి- 'రేపు రమ్మని చెప్పాను. శ్రమ తప్పదు మరి. మీరో గంట సైన్సు తీసుకున్న తరవాత నేనో గంట ఇంగ్లీషు తీసుకొంటాను. నేను క్లాసు తీసుకుంటున్నానని తెలిస్తే కుర్రాళ్ళెవరూ రారు! అందుకని మిమ్మల్ని కూడా ఇరికించవలసి వచ్చింది!'' అన్నాడు హెడ్మాష్టరు.

మాట మంచితో ముందర కాళ్ళకి బంధం వేసి మాట్లాడే హెడ్మాస్టారి లౌక్యం కుమారస్వామికి తెలియంది కాదు. "అలాగేనండి'' అని చిన్నగా నవ్వుకొంటూ స్టాఫ్ రూంలోకి దారి తీశాడు.

గుడ్డి వెల్తుర్లో నోటీసు బోర్డుని చూడ్డానికి ప్రయత్నిస్తున్న శ్రీహరి - హెడ్మాష్టరు మాటలు విని నవ్వు ఆపుకోలేకపోయాడు. హెడ్మాష్టరు శ్రీహరి దగ్గరగా వెళ్ళి, "రేపు- క్లాసులకి కుర్రాళ్లెవరూ రాకపోతే, నీ చెవి మెలిపెట్టేస్తాను. నేను క్లాసు తీసుకుంటున్నట్లు ఎవరికీ చెప్పకు!'' అన్నాడు.

"ఎవరికీ తెలియకపోతే, ఇంగ్లీషు పుస్తకాలు తెచ్చుకోరు సార్!'' అన్నాడు శ్రీహరి, నవ్వుని ఆపుకోవడానికి ప్రయత్నిస్తూ. హెడ్మాష్టరు కూడా నవ్వకుండా ఉండలేకపోయాడు. "సరేలే, నీ తెలివికి సంతోషించాంలే! నాలుగయిదు ఎస్సేలు నేను డిక్టేట్ చేస్తాను. రాసుకుందురు కాని. టెక్స్ట్ పుస్తకాలు అవసరం లేదు'' అన్నాడు.

శ్రీహరి తల ఆడించి స్టాఫ్ రూమ్ వైపు వెళ్ళబోయాడు. హెడ్మాష్టరు ఉన్నట్టుండి శ్రీహరిని ఆపి, "అన్నట్టు నోటీస్ బోర్డు చూస్తున్నావు! గుడ్డి వెలుతురులో ఏం కనబడు తుందని? ఉదయం పూట చూడలేదా? ఫైన్‌తో కట్టినా కూడా పరీక్ష ఫీజుకి ఆఖరి రోజు ఎల్లుండి. ఇంతకీ నువ్వు ఫీజు కట్టినట్టు లేదు కదూ?'' అని ప్రశ్నించాడు.

నాలుగు రూపాయలు చేసే కాడ్‌బరీస్ చాక్లెట్ తింటూ, టాఫీలు కొనుక్కోడానికి నీ దగ్గర డబ్బులున్నాయా అని పెదరాజుగారబ్బాయి అడిగినప్పుడు కూడా శ్రీహరి అంతగా బాధపడలేదు కాని, హెడ్మాష్టరన్నమాటలు, దివిసీమను దిబ్బ చేసిన అలలా శ్రీహరిని తాకడంతో దుఃఖం గంగలా పొంగింది. మొహం మీద పడుతున్న వానజల్లుతో పాటు, కళ్ళమ్మట గోదావరి ప్రవహించింది.

శ్రీహరి నుంచి సమాధానం రాకపోవడం చూసి హెడ్మాష్టరు "ఏ అప్పోసప్పో చేసి డబ్బు కట్టాలి కాని, చూస్తూ కూర్చుంటే ఎలా? మీ అన్నయ్యతో చెప్పు'' - అంటూ గదిలోకి పోయాడు.

స్టాఫ్ రూంలోంచి గొడుగు తీసుకొని బయటకు వస్తున్న కుమారస్వామి హెడ్మాష్టర్ అన్న మాటలు విన్నాడు. శ్రీహరి దగ్గరగా వచ్చి, భుజం మీద చెయ్యి వేసి, "పద పద'' అన్నాడు. వరండా మెట్లు దిగబోయే ముందు గొడుగు విప్పి, మళ్ళీ శ్రీహరి భుజం మీద చెయ్యి వేసి నెమ్మదిగా అడిగాడు- "పరీక్ష ఫీజు కట్టలేదెందుకని?''

"అన్నయ్యని చాలాసార్లు అడిగాను. ఇదుగో, అదుగో అంటూ ఇంతకాలం జరిగి పోయింది. ఇవ్వాళ ఉదయం కూడా జ్ఞాపకం చేశాను. అలాగే చూద్దాంలే, ఎల్లుండి వరకూ టైం ఉంది కదా అన్నాడు''

శ్రీహరి మాటల్లోని గాద్గదికం కుమారస్వామిని కదిలించింది. చక్రం బురద గుంటలో పడి నిస్సహాయంగా నిలుచున్న బండివాణ్ణి చూసి, దారినపోయే జనంలో నవ్వేవాళ్ళూ, 'అయ్యో పాపం' అని జాలి చూపించి పెదవి విరిచే వాళ్లే చాలామంది. కుమారస్వామికాసమయంలో శ్రీహరి కెందుకో సహాయం చెయ్యాలనిపించింది.

"ఫీజు కట్టకపోతే ఏడాది చదువూ వృధా అయిపోతుంది. సరే, నాతో యింటికి రా. ఆ డబ్బు నేను సర్దుతాను. తరవాత తిరిగి ఇవ్వవచ్చు" అన్నాడు.

శ్రీహరి మాటలతో కృతజ్ఞత తెలుపుకోలేదు. భుజం మీద వేసిన చెయ్యిని తీసి కళ్ల కద్దుకున్నాడు.

శ్రీహరి మనసు ఆనందంగా ఉంది. మాష్టారిచ్చిన డబ్బు లాగు జేబులో పెట్టుకొని ఇల్లు జేరాడు. అరుగు మీద కుర్చీలో కూర్చుని దుప్పటి కప్పుకుని సిగరెట్ కాలుస్తున్న రామకోటి, తమ్ముడు శ్రీహరి రాకని గమనించలేదు. లోపలకి వెళ్ళి డబ్బు తీసి లెక్కల పుస్తకంలో దాచి, తడితడిగా ఉన్న బట్టల్ని మార్చి పొడి బట్టలు కట్టుకున్నాడు శ్రీహరి.

వదులుతున్న పొగల తివాచి మీద గగనవీధుల్లో విహరిస్తున్న రామకోటి కిందికి పడడం, పాతాల సముద్రంలో మునిగిన శ్రీహరి పైకి తేలడం, వంటింట్లోంచి వచ్చిన భోజనం పిలుపు వల్ల ఒకేసారి జరిగింది. ఉన్న నెయ్యిని కాస్తా ఇద్దరి పిల్లలకీ, మొగుడికీ వేసి ఉత్త గరిటని తన విస్తట్లోకి విదిల్చినందుకు, వదినను చూసి చిన్నగా నవ్వుకున్నాడు శ్రీహరి. నీళ్ళ చారు అన్నంతో కలుపుతూ, "అన్నయ్యా! నా పరీక్ష ఫీజు..." అని ఇంకా ఏదో అనబోతున్న శ్రీహరి మీద ఒక్కసారి విరుచుకుపడింది రామకోటి భార్య.

"నీకింక వేరే సమయం దొరకలేదా? ఈ కాస్త తిండి కూడా సహించకుండా, నీ అవసరాల్నిగురించి ఇప్పుడే అఘోరించాలా ఏమిటి? ఇప్పటికిది ఎన్నోసారి అడగడం?"

శ్రీహరికి మనస్సు చివుక్కుమంది. వికసించిన మల్లెల్ని వాసనలు వెదజల్లనీయకుండా మురికి కాలవలో పడవేసినట్లయింది. మరి మాట్లాడబుద్ధివేయక మౌనంగా ఉండిపోయాడు.

"వాడి మీదెందుకు నోరు చేసుకుంటావు? పరీక్ష ఫీజు కోసం అడిగాడంతే కదా! హరీ! ఎల్లుండి కదా కావలిసింది? అప్పటికి ఏర్పాటు చేస్తాగా" అన్నాడు రామకోటి డాంబికంగా.

"అయినవాడు కాబట్టి అలా వెనకేసుకొస్తున్నారు. పక్కింటావిడ దగ్గర పుచ్చుకున్న చేబదులు ఇప్పటికీ తీర్చలేదు! పది సార్లడిగింది. మరి దాని సంగతి? చిన్నాడికి లాగులు చిరిగి పోయాయి. మరి వాటి సంగతి?" విసురుగా, విసుగ్గా అడిగింది.

ఆ కోపం అన్న మీద కాదని శ్రీహరికి తెలుసు. వదిన అన్నకి ఆలి కాగలిగింది కాని, తనకి తల్లి కాలేదని శ్రీహరి ఏనాడో గ్రహించాడు. అయినా అన్నగార్నలా అంటోంటే వూరుకోలేక అన్నాడు: "అది కాదు, వదినా, పరీక్ష ఫీజుకి కుమారస్వామి మాష్టారు డబ్బిచ్చారని అన్నయ్యతో చెబుదామనుకుంటోంటే నువ్వు పూర్తిగా వినకుండా....."

"అష్టోత్తరం మొదలెట్టానంటావు? ఆయన మట్టుకు వూరికే ఇచ్చాడంటావా? ఎలాగూ మీ అన్నయ్య తీర్చవలసిందే కదా?" రామకోటి భార్య అసహనంగా అంది.

నేల కరిచి లేవబోతున్న వస్తాదుని మూతి మీద తన్ని మళ్ళీ పడగొట్టినట్లయింది

శ్రీహరికి. అన్నం మీద ఒక్కసారిగా రోత పుట్టింది. విస్తరి ముందు నుంచి లేచిపోయి మరింత రాద్ధాంతం కలగచెయ్యడం ఇష్టం లేక పెట్టిన తిండిని నోట్లో కుక్కుకొని లేచాడు శ్రీహరి.

అరుగు మీద కూర్చుని ఆకాశంలో కనబడని నక్షత్రాల కోసం వెదుకుతున్న శ్రీహరి, రామకోటి మాటలతో ఈ లోకంలో పడ్డాడు.

"వదిన మాటలు పట్టించుకోకు. పక్కింటావిడకి పదిహేనివ్వాలట. ఆవిడ అడిగిందని అవమానపడి అలా చేసుంటుంది!"

మంచుగడ్డలాంటి తన మనస్సుని కొవ్వొత్తితో కరిగించడానికి అన్న ప్రయత్నిస్తున్నాడని శ్రీహరికి అనిపించింది. సమాధానం ఇవ్వకుండా కూర్చున్నాడు. "చూడు- ఆయనిచ్చిన డబ్బు ఇలా ఇవ్వు. పక్కింటావిడకి బాకీ తీర్చేయమని వదిన కిస్తాను. లేకపోతే నన్నీ రాత్రికి నిద్ర పోనివ్వదు. రేపు మధ్యాహ్నానికల్లా రామవరం నుంచి ఒక పార్టీ డబ్బు అందజేస్తుంది. వాళ్ళకి ఆఫీసులో నేను సహాయం చేసిపెట్టాను. దాంతో నీ పరీక్ష ఫీజు కట్టడమే కాకుండా మాష్టారికి డబ్బు కూడా తిరిగి ఇచ్చేయవచ్చు!"-రామకోటి నెమ్మదిగా నసుగుతూ శ్రీహరిని బుజ్జగిస్తూ అన్నాడు.

కాపు రాని చెట్ల నుంచి, ఎదగని చెట్ల నుంచి ఫలాల్ని ఆశించే మాలిలా కనబడ్డాడు రామకోటి - శ్రీహరికి. ఒకరకమైన నిర్లిప్తత మనసులో చోటు చేసుకుంటూండగా, లేచి లోపలికి వెళ్లి లెక్కల పుస్తకంలో దాచిన డబ్బు తీసి అన్న చేతికిచ్చాడు.

ఆ రాత్రి శ్రీహరి మనసులో ముసురు పట్టింది. కలవరింతల కలత నిద్రే శరణ్యమైంది. మరునాడు కూడా బారెడు పొద్దెక్కినా, సూర్యుడి కిరణం భూమ్మీద పడలేదు.

మధ్యాహ్నం భోజనాలైన తరవాత రామకోటి భార్య అంత వానలోనూ పక్కింటావిడతో కలిసి బయటికి పోయింది, సినిమా బాకీ తీర్చడం కోసం. పెళ్ళాం సినిమాకి వెళ్ళగా చూసి, రామకోటి రామవరం పార్టీ ఆఫీసు దగ్గరొస్తుందని చెప్పి క్లబ్బుకి పోయాడు. పెళ్ళానికివ్వగా మిగిలిన డబ్బుని రెండింతలు చేద్దామని కలలు కంటూ. పేకాడి, ఉన్నదంతా వూడ్చిపెట్టి, మరో అంత అప్పు పడి ఇల్లు చేరాడు రామకోటి. జోగిలా ఇంటి కొచ్చిన అన్ననీ, హుషారుగా తిరిగొచ్చిన వదిననీ చూసి శ్రీహరి ఈ మాటు జాలిపడ్డాడు.

"కాఫీ త్వరగా కలుపు. తల నొప్పిగా ఉంది" అంటున్నాడు రామకోటి వంటగది గుమ్మం మీద కూర్చుంటూ.

"అదే ప్రయత్నంలో ఉన్నాను. వెధవ బొగ్గులన్నీ తడిసిపోయాయి. పాత కాగితాలేమైనా ఇవ్వండి అంటించడానికి" అంటోంది రామకోటి భార్య.

శ్రీహరి తన లెక్కల పుస్తకం వంటింట్లోకి తీసుకువెళ్ళి, వాళ్ల ఎదురుగా నాలుగైదు పేజీలు చించి, వదిన చేతిలో ఉంచాడు హాయిగా, నిండుగా నవ్వుతూ.

ఒక పసి హృదయం బండబారింది. వికసించబోయే ఒక కుసుమం మొగ్గగానే రాలింది.

(ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక : 29-10-1980)